# కథ - ప్రపంచీకరణ ప్రభావము

**డా. ఎం. పద్మకుమారి,** అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు,
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, (స్వయం), బేగంపేట్, హైదరాబాద్ - 16.

శ్రీ ఆధునికాంధ్ర సాహిత్య ప్రక్రియలో కథకు ఉన్నత స్థానమున్నది. మానవుని మేధస్సుకి ఆలోచన, సృజన శక్తులు సమకూరినప్పటి నుండి కథాకల్పన ప్రారంభమైంది. విక్రమార్క, భేతాళ, పేదరాశి పెద్దమ్మ కథలు ఆ నేపథ్యం నుండి వచ్చినవే. ఆనాటి కథల్లోని తార్కికబుద్ధి, మానసిక వికాసము నేటికీ చెక్కు చెదరక ఉంది. క్లుప్తత, నిర్దుష్టత, స్పష్టత, సునిశిత కథకు ముఖ్య ఆకర్షణలుగా నిలిచినవి.

సమాజాన్ని పరిశీలిస్తూ, ప్రాధాన్యమిస్తూ పాత్రలను సృష్టించి, కథను అల్లి, ఆ కథ ద్వారా లోకము ఏమి కోరుతున్నదో పాత్ర ద్వారా స్పష్టపర్చడం కథలోని అంతర్లీనత. ప్రపంచీకరణ కథల్లో ఎక్కువగా పర్యవసానాలకు అనుకూల, ప్రతికూల భావాలు కలిగిన పాత్రల మధ్య నిరంతర సంఘర్షణ కన్పిస్తుంది. ప్రపంచీకరణకు అనుగుణంగా తనను తాను మలచుకొను పాత్రకు, ప్రపంచీకరణ వల్ల వస్తున్న విపరీత పరిణామాలకు విసిగి వేసారి, వాటిని వ్యతిరేకించే పాత్రకు మధ్య గల సంఘర్షణనే కథకు ఇతి వృత్తమవుతుంది. కథల ద్వారా పెరుగుతున్న ఆంతరాలను, తరగుతున్న మమతలను వ్యక్తము చేయగలుగుతున్నారు రచయితలు.

**'కుబుసం'** అనే కథలో అధికజీతం కోసం, సౌకర్యాల కోసం, బహుళజాతి సంస్థలో ఉద్యోగ ప్రయత్నం చేస్తున్న పాత్ర విహారి, మామూలు ఉద్యోగం చేస్తూ వ్యక్తిత్వం నిల్పుకొనే పాత్రగా ఉత్తర కన్పిస్తుంది. పరస్పర విరుద్ధ భావాలు గల రెండు పాత్రల మధ్యగల ఘర్షణను 'కుబుసం' కథ చిత్రించింది.

ఒకే పాత్ర ద్వారా పరస్పర విరుద్ధ భావాలు చిత్రించిన కథ **'కొలీగ్స్'** . ఇందులో కృషి, ప్రీతి భార్యాభర్తలు. మెడికల్ టాన్స్ స్క్రిప్షన్ ప్రాజెక్ట్ కోసం ఇంట్లోనే కార్యాలయాన్ని నిర్వహిస్తుంటారు. చంటి బిడ్డను తల్లి దగ్గర ఉంచి, బిజినెస్ లో భర్తకు తోడ్పడే ప్రీతికి మాతృత్వపు మాధుర్యాన్ని కోల్పోతున్నట్లు అన్పిస్తుంటుంది. తన తోటి ఉద్యోగుల దృష్టిలో ప్రీతి కృషికి భార్యగానే గుర్తింపు పొందుతుంది గాని, ఆమెకంటూ ప్రత్యేక గుర్తింపు లేదు. ప్రపంచమంతా ఒక కుగ్రామంగా మారిన నేడు మానవ విలువలు, సంబంధ బాంధవ్యాలు కనుమరుగైపోయి డబ్బే ప్రధాన భూమికను ధరిస్తుందనడానికి ఈ కథ ఒక నిదర్శనము. ప్రపంచీకరణ పేరుతో కుటుంబ విచ్ఛిత్తి జరుగుతుందనడానికి ఇదే తార్కాణము.

**ప్రపంచీకరణ వల్ల నైతిక పతనము** : 'సాలభంజిక' కథలో ఖరీదైన జీవితము, ఉద్యోగంలో ఉన్నతి, కార్లలో ప్రయాణములు వర్ణింపబడ్డాయి. విదేశాల నుండి వచ్చే అధికారులకు ఇక్కడ ఉన్న బహుళజాతి సంస్థలు ఏర్పాటుచేసే అతిథి సత్కారంలో భాగంగా హైదరాబాద్ నగర సందర్శనం ఉంటుంది. విదేశీ అధికారులను సంతోష పర్చుటకు బహుళజాతి సంస్థలు అనేక రకాలుగా ప్రయత్నిస్తున్నాయి. హైదరాబాదు చూపించుటకు ఒక యువతిని నియమించి ఉంచుతారు ఒ.ఆ వాళ్ళు. ఆ యువతే మాధురి. ఆమె జీవితంలో జరిగిన వివిధ మలుపులను, బహుళజాతి సంస్థలోని దుర్మార్గాలను, వాటి ప్రయోజనము కొరకు ఉద్యోగస్తులను ఉపయోగించుకునే తీరును రచయిత్రి కన్నులకు కట్టినట్లు చిత్రించారు.

ముప్పాళ రంగనాయకమ్మ రచించిన **'మురళీవాళ్ళమ్మ'** కథలో స్త్రీ జీవితము మీద ప్రపంచీకరణ చూపే ప్రభావమును చిత్రింపబడింది. మురళి చిన్నప్పుడు, అతని తండ్రి మరొక స్త్రీని వివాహం చేసుకుంటాడు. నిస్సహాయురాలైన తల్లికి సహాయంగా ఉండి, తల్లి చెప్పినట్టు విని చదివి ఒక బహుళ జాతి సంస్థలో ఉద్యోగం సంపాదించుకుంటాడు మురళి. కంపెనీ ఇచ్చే బహుమతులు మొదట్లో ఆనందాన్నిచ్చినా, తర్వాత తర్వాత ఆ వస్తువులంటేనే చిరాకుగా, అసహ్యంగా అన్పిస్తుంటుంది మురళి భార్యకు. తల్లితో, భార్యతో మాట్లాడే తీరుబడి లేని మురళి తన కొలీగ్ తో సఖ్యతగా ఉండడము, ఇంట్లో ఉన్నా ఫోన్ లో మాట్లాడడం మురళి భార్యకన్నా మురళి తల్లిని ఎక్కువగా ఆలోచింపజేశాయి. అతని చిన్నప్పటి సంఘటనను గుర్తుకు తెచ్చి కొడుకులో మార్పు తెచ్చే ప్రయత్నం చేస్తుంది మురళి వాళ్ళమ్మ.

ప్రపంచీకరణ వల్ల కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమైపోవడమే గాక అనైతిక, అధార్మిక పనులకు పాల్పడే అవకాశాలు కల్పించబడుతున్నాయి.

**సామాజిక విజ్ఞానము** : ప్రపంచీకరణ వల్ల, ప్రపంచబ్యాంకు ఆజ్ఞల మేరకు రోడ్లు వెడల్పు చేయడం, ఫ్లై ఓవర్ కట్టించడం జోరుగా సాగుతుంది. అటువంటి రోడ్డు వెడల్పులో భాగంగా ఖాదర్ దుకాణం కూల్చివేస్తారు ప్రభుత్వం వారు. సాధారణంగా ప్రజలకు అవసరమైన సదుపాయాలను, ఉపాధిని కల్పించే బాధ్యతను గలిగి ఉన్న ప్రభుత్వమే నిలువనీడలేని స్థితికి కారణమైంది. స్వయంగా ఉపాధినేర్పాటుచేసుకున్న ఖాదర్కి బ్రతుకే భారమయ్యేలా ప్రవర్తించిన ప్రభుత్వానికే ప్రపంచ బ్యాంకు నుండి వస్తున్న ఒత్తిడీ కారణమైనా, విచక్షణ కోల్పోయి ప్రజలకు ఉన్న ఉపాధిని కూల్చివేసి మానసిక ఆందోళనకు గురిచేయడం ఈ కథ చెప్పుతుంది.

పల్లెలను ఆశ్రయించి ఉన్న గ్రామీణులు కాలాలు మారిపోయి పంటల్లేక, పొట్ట చేత పట్టుకొని పట్టణానికి వచ్చి సంపాదించుకొని తిరిగి పల్లెకు పోవడానికి పయనమైనప్పుడు తాను పల్లె విడుచునాటికి పల్లె చేరునాటికీ మధ్య వచ్చిన ఎన్నో మార్పులు. 'ఈ పయనం ఎక్కడికి' కథలో రాచపాలెం చంద్రశేఖరరెడ్డి చిత్రించారు.

**'విరూపం'** కథలో పల్లె, పల్లె పక్కనే సిమెంట్ ఫ్యాక్టరీలు ఏర్పడి, వాటి నుండి వచ్చే సిమెంటు భూమి, బూడిద పంటపొలాల మీద పడి పైరు మొత్తం బూడిద రంగుగా మారి పంటకు నష్టం కలుగుతుంది. రావలసినంత ఆదాయము రాదు. అటువంటి పరిస్థితిని కన్నులకు కట్టినట్లు వర్ణించి కథకుడు తన ప్రతిభను చాటుకున్నాడు.

ఫ్యాక్టరీలు రావడం వల్ల జీవనభృతి దొరుకుతుందనుకున్నా రైతుకి ఆ ఫ్యాక్టరీలే పంటల పట్ల ఆశనిపాతాలై రైతులకు నిరాశ, నిస్పృహలు కల్గించాయి. కరువు కారణాలను, రైతుల ఇక్కట్లను ఫ్యాక్టరీల నుండి వెలువడే వ్యర్థాలు భూమి మీద చూపే దుష్ప్రభావాలను గ్లోబలైజేషన్ పరిణామముగా చిత్రించడం జరిగింది.

**'కీలుబొమ్మలు'** కథలో పంటలు పండుతున్న పచ్చని పొలాలు వ్యవసాయపు పొలాలుగా గాక, వాణిజ్యపు పంటలు వేసి వర్తక కేంద్రాలుగా మారినాయని, దిగుబడి వచ్చుటకు వాడే పురుగు మందులు, యాసిడ్లు ఉపయోగాన్ని రచయిత చెప్పారు.

అధిక దిగుబడి కోసం సేంద్రియ ఎరువుల వాడకం పూర్తిగా తగ్గించి రసాయనాలతోనే వ్యవసాయం చేయడము సామాన్యమైంది. ఆ రసాయనములు విషపూరితములు. పురుగులు చావడము తర్వాతి మాట ముందు వాటి వల్ల వాతావరణమెంతో నష్టపోతుంది.

**కోకాకోలా, పెనం, అమ్మకానికి ఆక్సిజన్** కథలు పర్యావరణ పరిరక్షణను ప్రధానంగా వివరిస్తూ ప్రపంచీకరణ అనే ముసుగు వాతావరణమును, చెట్టు చేమను పంట పాడిని ఎంత నష్టపరుస్తుందో దాని మీద ఆధారపడి బ్రతుకుతున్న మానవుడు తనకు తెలియకుండానే తాను కూచున్న కొమ్మను తానే ఎలా నరుక్కుంటున్నాడో తెలియజేస్తున్నాయి.

ప్రపంచీకరణ పేరుతో ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న పరిణామాల వల్ల మానవసంబంధాలు, కౌటుంబిక వ్యవస్థ, సంస్కృత సంప్రదాయాలు ఎంతో నష్టపోతున్నాయి. ప్రాణికోటి జీవింపజేస్తున్న ప్రకృతికి విఘాతం కలుగుతుంది. విశ్వశ్రేయస్సు కోరే విద్యావేత్త మానవకోటిని వివిధ ప్రక్రియల్లో జాగృతం చేశాడు. చైతన్యవంతం చేస్తున్నాడు.